
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 1 ఆగస్టు 2024



సిఫార్సులకే ప్రాధాన్యం!



తహసీల్దార్లకు పోస్టింగ్‌లో ఇష్టారాజ్యం

- గన్నవరంలో పనిచేస్తున్న అధికారికి మళ్లీ అక్కడే బాధ్యతలు
- జిల్లాలో 35 మందికి పోస్టింగ్‌లు

తహసీల్దార్ల బదిలీల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న గందరగోళానికి తెరపడింది. తహసీల్దార్ల పోస్టింగ్‌లలో సిఫార్సు లేఖలకే అత్యంత ప్రాధాన్యత దక్కింది. వివాదాస్పద అధికారులకూ కోరుకున్న ప్రాంతమే దక్కింది. అక్రమాలకు సహకరించిన వారికి అందలమే దక్కింది. జిల్లాలో 35 మంది తహసీల్దార్లకు పోస్టింగు ఇస్తూ కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

మచిలీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల నిమిత్తం జిల్లాకు వచ్చిన కొందరు తహసీల్దార్లకు ఇక్కడే పోస్టింగ్ ఇవ్వడం వివాదాస్పమవుతోంది.

- గన్నవరం తహసీల్దార్‌గా ఎస్. సీతపవన్‌కుమార్ ఎన్నికల విధుల నిమిత్తం గన్నవరం వచ్చారు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన ఆయన గడువు పూర్తయినా ఇక్కడే మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం, రాజనగరంలలో పనిచేసి, ఎన్నికల విధుల నిమిత్తం గన్నవరం వచ్చిన ఆయనను ఇక్కడే కొనసాగించడం వివాదాస్పదమవుతోంది.
- సీసీఎల్ఏ నుంచి వచ్చిన మోపిదేవి తహసీల్దార్ శ్రీవిద్యను అదే మండలంలో కొనసాగించారు. గతంలో మచిలీపట్నం తహసీల్దార్‌గా పనిచేసిన ఆమె ఎన్నికల కోడ్ సమయంలో మచిలీపట్నంలో అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే అంశంలో అనధికారికంగా సంతకాలు చేయడం వివాదాస్పదమైంది.
- బంటుమిల్లి తహసీల్దార్‌గా వీవీ భరత్‌రెడ్డి వస్తారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అందరూ అనుకున్నట్టుగానే ఆయనకు బంటుమిల్లి మండలాన్ని కేటాయించారు. గతంలో కలెక్టరేట్‌లో దీర్ఘకాలం పాటు పనిచేస్తూ ఎన్నికల ముందు లేదా ఎన్నికల విధుల నిమిత్తం ఇతర జిల్లాలకు వెళ్లిన ఇద్దరు తహసీల్దార్లకు మళ్లీ కలెక్టరేట్‌లోనే పోస్టింగ్ ఇచ్చారు.



35 మంది తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

సీహెచ్ వీరాంజనేయప్రసాద్‌ను కలెక్టరేట్ ఏవోగా, పీఏవీ ప్రసాద్‌ను కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, బి.నెల్సన్‌పాల్‌ను కలెక్టరేట్ లాండ్ సెక్షన్ ఏవోగా నియమించారు. కే ఆంజనేయులును కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్‌కు, కే సత్యసులోచనను కలెక్టరేట్ ల్యాండ్ ప్రొటెక్షన్ స్పెషల్ తహసీల్దార్‌గా, ఏఎస్ఎన్ రాధికను ఎల్ఏ (పీడబ్ల్యూడీ) స్కీమ్ ప్రత్యేక తహసీల్దార్‌గా, జె.విమలకుమారిని ఆథరైజ్డ్ ల్యాండ్ రికార్డ్స్ ప్రత్యేక తహసీల్దార్‌గా నియమించారు. షేక్ లతీఫ్‌పాషాను మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయ ఏవోగా, డి.ప్రశాంతిని మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం కేఆర్‌సీసీ ప్రత్యేక తహసీల్దార్‌గా, సీహెచ్ నరసింహారావును గుడివాడ ఆర్డీవో కార్యాలయ ఏవోగా, డి.సునీల్‌బాబును ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా పోస్టింగ్ ఇచ్చారు. వి.నాగభూషణంను బాపులపాడు, ఎస్.సీతపవన్‌కుమార్‌ను గన్నవరం, వి.రామకోటేశ్వరరావును గుడివాడ, టి.మల్లిఖార్జునరావును గుడ్లవల్లేరు తహసీల్దార్లుగా పోస్టింగ్ ఇచ్చారు. బి.రామనాయక్ నందివాడ, డి.రాజ్యలక్ష్మీ బంటుమిల్లి, కేజీఎన్ సోమేశ్వరరావుకు కృత్తివెన్ను మండలాల్లో పోస్టింగ్ ఇచ్చారు. అబ్దుల్ రెహమాన్‌మస్తానా పెడన, పి.మధుసూదనరావు మచిలీపట్నం సౌత్, జి.మురళీధర్ అవనిగడ్డ, డి.వనజాక్షి చల్లపల్లి, బి.విజయ్‌ప్రసాద్‌లను ఘంటసాల మండలాల్లో నియమించారు. బి.శ్రీనునాయక్‌ను కోడూరు, ఎం.శ్రీవిద్య మోపిదేవి, ఎం.హరనాథ్ నాగాయలంక, కే మస్తాన్‌ను మొవ్వ, జి.రవికాంత్‌ను పామర్రు, కే నవీన్‌కుమార్‌ను పమిడిముక్కల మండలాల్లో నియమించారు. వై.రంగారావును పెదపారుపూడి, ఎం.కుసుమకుమారిని తోట్లవల్లూరు. వి.భవన్నారయణను కంకిపాడు, కే గోపాలకృష్ణను పెనమలూరు, ఎం.సురేష్‌కుమార్‌ను ఉయ్యూరు మండల తహసీల్దార్లుగా పోస్టింగ్ ఇచ్చారు.

వ్యాపారమే పరమావధిగా మారిపోయిన రైల్వేకు పేదల ఇబ్బందులు పట్టడం లేదు. లాభార్జన కోసం జనరల్ బోగీలను కుదించడంతో సామాన్య ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. స్లీపర్ కోచ్‌లను కూడా రెట్టింపు సంఖ్యలో కుదించేశారు. ఓ పథకం ప్రకారం రైల్వేను ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో విజయవాడ రైల్వే పరిధిలోనూ సామాన్య ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి.



జనరల్‌లో ఎక్కితే చుక్కలే..!

రైళ్లలో ప్రయాణం సామాన్యులకు నరకం

- సరిపడా జనరల్ బోగీలు లేక జనం విలవిల
- కిక్కిరిసిన బోగీల్లో ప్రమాదకరంగా ప్రయాణం
- పెరుగుతున్న గొడవలు, కొట్లాటలు
- జనరల్ బోగీల కుదింపుతో తంటాలు
- గతంలో 4 జనరల్ బోగీలు.. ఇప్పుడు ఒక్కటే

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కరోనా తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైల్వే సామాన్యుడికి దూరమవుతూ వస్తోంది. పాసింజర్ల రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చేయడం, జనరల్ బోగీలను నాలుగు నుంచి దశలవారీగా ఒక్క బోగీకి తీసుకురావడం, స్లీపర్ కోచ్‌లు 15 నుంచి 5కు పరిమితం చేయడం చేస్తున్నారు. ఏసీ బోగీల సంఖ్యను రెండు, మూడు రెట్లు పెంచుకుంటూ పోతున్నారు. రైళ్లలో సింహభాగం పేద, మధ్య తరగతి వర్గాలే ప్రయాణిస్తుంటారు. కానీ, ధనిక వర్గాలకే ప్రాధాన్యమిచ్చేలా ఏసీ బోగీలను పెంచడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కిక్కిరిసిపోతున్న బోగీలు

విజయవాడ డివిజన్ పరిధిలో ఏ రైలు చూసినా ఒకే ఒక్క జనరల్ బోగీ, ఐదు స్లీపర్ కోచ్‌లు ఉంటున్నాయి. ఇవి సామాన్యులకు సరిపోవట్లేదు. పోనీ కోచ్‌ల్లో ప్రయాణికులు సరిపడా టికెట్లు ఇస్తున్నారా అంటే అదీ లేదు. పరిమితిని మించి టికెట్లు జారీ చేస్తున్నారు. దీనికితోడు టికెట్ తీసుకోని వారు కూడా జనరల్ బోగీల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఉన్న ఒకే ఒక్క జనరల్ బోగీలో ఇసకేస్తే రాలనంత జనం కనిపిస్తున్నారు. సీట్ల కోసం గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. టాయ్‌లెట్స్ వరకు కూడా కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఆఖరుకు సీట్ల దగ్గర కాళ్లు పెట్టుకునే ప్రాంతంలో కూడా కూర్చోవాల్సి వస్తోంది.

అమృత్ భారత్‌లో పరిస్థితి దారుణం

పేదల కోసం రేటు పెంచి నడుపుతున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఇటీవల విజయవాడకు ఒకటి కేటాయించారు. ఈ రైల్లో అన్నీ సాధారణ సీటింగ్ బోగీలే. ఫస్ట్, సెకండ్, థర్డ్ క్లాస్ అంటూ వర్గీకరించారు. ఈ రైల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. బోగీలన్నీ కిటకిటలాడుతున్నాయి. ట్రెయిన్ రూఫ్‌కు దుప్పట్లను ఉయ్యాలలా కట్టుకుని అందులో కూర్చుంటున్నారు. రైళ్లలో ఒక జనరల్ బోగీని పెంచుతామని ఇటీవల కాలంలో రైల్వే అధికారులు గొప్పగా ప్రకటించారు. కానీ, ఇప్పుడున్న డిమాండ్ దృష్ట్యా కనీసం రైలుకు ఐదు జనరల్ బోగీలనైనా నడపాల్సిన అవసరం ఉంది.

మచిలీపట్నం మునిసిల్ కార్పొరేషన్ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. 25 ఏళ్లుగా పారిశుధ్య విభాగంలో కార్మికులను భర్తీ చేయకపోవడంతో పర్మినెంట్ కార్మికుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు 010 పద్దు ద్వారా ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోంది. దీంతో మునిసిపల్ కార్యాలయంపై ఆర్థిక భారం పడేది కాదు. కార్మికులను కాంట్రాక్టు పద్ధతిపై తీసుకుని, వారికి మునిసిపల్ కార్పొరేషన్ ఆప్కాస్ ద్వారా జీతాలు చెల్లిస్తోంది.

అభివృద్ధి శూన్యం.. భారాలు అధికం!

ఆర్థిక సమస్యతో కొట్టుమిట్టాడుతున్న బందరు మున్సిపల్ కార్పొరేషన్

- పారిశుధ్య కార్మికుల జీతాలకే ఏడాదికి రూ.15 కోట్లు
- 25 ఏళ్లుగా పారిశుధ్య విభాగంలో పర్మినెంట్ ఉద్యోగాలు భర్తీ చేయని వైనం
- గతంలో 600 మంది పర్మినెంట్ ఉద్యోగులు
- ప్రస్తుతం 90 మంది మాత్రమే
- శాశ్వత ఉద్యోగులకు ప్రభుత్వ వేతనం

కాంట్రాక్టు కార్మికులకు మున్సిపాలిటీ చెల్లింపు

వీరి సంఖ్య పెరిగే కొద్దీ కార్పొరేషన్‌పై భారం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మునిసిపాలిటీ స్పెషల్‌గ్రేడ్ మునిసిపాలిటీగా 1866లో ఏర్పడింది. బ్రిటీష్, డచ్ పాలకులు మచిలీపట్నాన్ని కేంద్రంగా చేసుకుని ఇక్కడే నివాసం ఉండి పరిపాలన, వ్యాపార కార్యకలాపాలను నిర్వహించేవారు. 26.67 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఈ పురపాలకసంఘాన్ని 2018లో మునిసిపల్ కార్పొరేషన్‌గా మారుస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2021 నుంచి మునిసిపల్ కార్పొరేషన్‌గా అధికారికంగా పరిపాలనలోకి మారింది. 2.50 లక్షల మంది జనాభా మునిసిపల్ కార్పొరేషన్‌లో నివసిస్తున్నారు. 25 ఏళ్ల క్రితం వరకు ఈ మునిసిపాలిటీలో 600 మంది వరకు పారిశుధ్య విభాగంలో శాశ్వత ఉద్యోగులుగా పనిచేసేవారు. ప్రభుత్వం ద్వారానే వీరికి వేతనాలు అందేవి. కాలక్రమంలో పర్మినెంట్ ఉద్యోగులు పదవీ విరమణ చేయడం, మరణించడం తదితర కారణాలతో వీరిసంఖ్య క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం 90 మందికి చేరింది. వీరిలో 70 మంది పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తుండగా, మరో 20 మంది విద్యార్హతల ఆధారంగా మునిసిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులకు ప్రభుత్వం నేరుగా జీతాలను చెల్లిస్తుండటంతో కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడటంలేదు. 2009 నాటికి పారిశుధ్య కార్మికుల అవసరం పెరగడంతో అప్పటి నుంచి పాలకవర్గంలోని కౌన్సిలర్లు కాంట్రాక్టు కార్మికులకు కూడా మునిసిపాలిటీ ద్వారానే జీతాలు ఇచ్చేవారు.

జీత భత్యాలకు ఏడాదికి రూ.15 కోట్లు

ప్రస్తుతం మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్‌లలో 520 మంది పారిశుధ్య కార్మికులు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.21వేల చొప్పున జీతంగా కార్పొరేషన్ ద్వారానే చెల్లిస్తున్నారు. ఆప్కాస్ ద్వారా వీరి నియామకం జరిగినట్టుగా చూపి జీతాలు చెల్లిస్తున్నారు. దీంతో మునిసిపల్ కార్పొరేషన్‌పై నెలకు రూ.1.09 కోట్ల ఆర్థిక భారం పడుతోంది. ఏడాదికి కాంట్రాక్టు కార్మికులకు జీతాలు, ఇతరత్రా అలవెన్సులతో కలిపి రూ.15 కోట్లు చెల్లించాల్సి వస్తోంది.

శాశ్వత నియామకాలు శూన్యం

25 ఏళ్ల క్రితం కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల జీతం



మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

నెలకు రూ.900గా ఉండేది. అప్పటినుంచి వీరి జీతం వివిధ దశల్లో పెరుగతూ నేటికి రూ.21 వేలకు చేరుకుంది. పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే పారిశుధ్య కార్మికులకు ఇచ్చేజీతం తక్కువే కానీ, ఈ ప్రభావం మునిసిపల్ కార్పొరేషన్‌పై పడుతోంది. 25 ఏళ్లుగా పారిశుధ్య విభాగంలో పర్మినెంట్ విధానంలో పనిచేసే 500 మందికిపైగా పోస్టులు ఖాళీ అయినా వారి స్థానంలో ఇతరులను భర్తీ చేయకుండా అన్ని ప్రభుత్వాలూ మిన్నకుండిపోయాయి.

కార్పొరేషన్‌కు ఆర్థిక భారం

కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చి పారిశుధ్య కార్మికులను నియమించుకోవడంతో వారికి జీతభత్యాలు ఇచ్చే బాధ్యత మునిసిపల్ కార్పొరేషన్‌పైనే పడుతోంది. కార్పొరేషన్‌కు ఇంటి పన్నులు, ఇతరత్రాల రూపంలో వచ్చే ఆదాయంలో అధిక శాతం పారిశుధ్య విభాగానికి, తాగునీటి సరఫరాకు ఖర్చు చేస్తుండటంతో అభివృద్ధి పనులు ఆశించిన మేర చేయలేని స్థితిలో మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కొట్టుమిట్టాడుతోంది. 25 ఏళ్లుగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పారిశుధ్య కార్మికులను పర్మినెంట్‌గా నియమించకపోవడంతో కార్పొరేషన్‌పై ఆర్థికభారం పడి ఇతరత్రా అభివృద్ధి పనులు చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవిష్యత్తులో బందరు పోర్టు, ఆయిల్ రిఫైనరీ వంటి పరిశ్రమలు ఏర్పాటైతే నగరం విస్తీర్ణం మరింతగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆలోచన చేసి మునిసిపల్ కార్పొరేషన్‌పై ఆర్థికభారం పడకుండా చర్యలు తీసుకోవాలి.

దస్తావేజు నకలు ఇప్పించలేదని దాడి

- కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కలకలం
- పోలీసు కేసు నమోదు

6లో..

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

6లో..

ఇక వెళ్లండి..!

వైసీపీ వీర విధేయ పోలీసులకు ప్రభుత్వం ఝలక్

ఉమ్మడి కృష్ణాలో 12 మంది డీఎస్పీల బదిలీ

- ఒకరిద్దరికి మాత్రమే ప్రాధాన్య స్థానాలు
- మెజారిటీ డీఎస్పీలకు నో పోస్టింగ్
- జగన్‌పై గులకరాయి కేసులో విజయవాడ నార్త్ ఏసీపీ అతి
- జగన్ గుడివాడ పర్యటనలో డీఎస్పీ శ్రీకాంత్ అత్యుత్సాహం
- సెంట్రల్ ఏసీపీ సహా అంతా డీజీపీ కార్యాలయానికే..

నాడు వైసీపీకి వీర విధేయులుగా వ్యవహరించిన డీఎస్పీలకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. ఉమ్మడి కృష్ణా, పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 12 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. వైసీపీ ప్రభుత్వ పెద్దల మాటలే వేదాలుగా వ్యవహరించిన డీఎస్పీలను గుర్తించిన ప్రభుత్వం నేరుగా డీజీపీ కార్యాలయానికి బదిలీ చేసింది. ఎన్నికలకు ముందు ఇక్కడికి వచ్చిన వారికి, అంతకుముందు నుంచే వైసీపీ భజన చేసిన వారికి పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం నేరుగా డీజీపీ కార్యాలయానికి పంపించింది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



వైసీపీ వీరవిధేయులకు ఊస్టింగ్

- గుడివాడలో డీఎస్పీగా ఉన్న పి.శ్రీకాంత్.. జగన్ పర్యటన సమయంలో చిన్నచిన్న విషయాలకు తీవ్రంగా స్పందించారు. గుడివాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లను జగన్ లబ్ధిదారులకు అందజేశారు. ఆ సమయంలో టీడీపీ మహిళలు నల్లబెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి వేధించారు. తాజా బదిలీల్లో ఆయన్ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు.
- విజయవాడ సెంట్రల్ ఏసీపీగా ఉన్న పి.భాస్కరరావు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అరెస్టులో కీలకంగా వ్యవహరించారు. సీజీఎస్టీ అధికారుల నుంచి ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదును స్వీకరించి శరత్‌ను అరెస్టు చేశారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీలోని కొంతమంది పెద్దలు దీని వెనుక కథ నడిపారని తెలుస్తోంది. వారు చెప్పిన మాటల ప్రకారం శరత్‌పై కేసును నమోదు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన్ను కూడా డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు.
- గన్నవరం డీఎస్పీ జయసూర్యను భీమవరం డీఎస్పీగా బదిలీ చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడకు భూములిచ్చిన రైతులు పరిహారం కోసం ఆందోళనకు దిగారు. వారిని పరామర్శించడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెళ్లారు. ఆందోళన విరమించాలని హెచ్చరించి రైతులను అరెస్టు చేశారు. ఈ విషయం అప్పట్లో పెనుదుమారాన్ని రేపింది. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో జయసూర్యను భీమవరం డీఎస్పీగా నియమించడంతో కూటమి నేతలు అవాక్కవుతున్నారు.
- అజిత్‌సింగ్‌నగర్‌లో అప్పటి సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి కేసులో విజయవాడ నార్త్ ఏసీపీగా ఉన్న డీఎస్పీ ప్రసాద్ కీలకంగా వ్యవహరించారు. ఈ కేసుతో సంబంధం లేని మైనర్లను ఇరికించే ప్రయత్నం చేశారని విమర్శలు వచ్చాయి. చివరికి ఈ కేసులో నిందితుడిగా వేముల సతీష్‌కుమార్ బెయిల్‌పై జైలు నుంచి విడుదలైనప్పుడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. పోలీసులు తనకు తుపాకీ గురిపెట్టి నేరం అంగీకరించాలని బెదిరించారని ఆరోపించాడు. ఈ కేసులో ఏ2 ఉన్నాడని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఘటన జరిగి ఇన్నాళ్లయినా ఆ ఏ2 ఎవరో ఇప్పటికీ తెలియలేదు. ఇప్పుడు ఆయన్ను డీజీపీ కార్యాలయానికి పంపారు. తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న ఎం.రాజారావును విజయవాడ నార్త్ ఏసీపీగా నియమించారు.

బదిలీలు ఇలా..

కృష్ణాజిల్లా డీపీటీసీ (జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం)లో ఉన్న కె.రమేశ్‌బాబును రాజమహేంద్రవరం సెంట్రల్ డీఎస్పీగా బదిలీ చేశారు. నరసాపురంలో డీఎస్పీగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు కృష్ణాజిల్లా డీపీటీసీకి బదిలీ చేశారు. కృష్ణాజిల్లా దిశ పీఎస్ డీఎస్పీగా ఉన్న యు.నాగరాజును డీజీపీ కార్యాలయానికి పంపారు. గన్నవరం డీఎస్పీ జయసూర్యను భీమవరం డీఎస్పీగా బదిలీ చేశారు. 14వ బెటాలియన్‌లో ఉన్న కె.దామోదర్‌ను విజయవాడ సెంట్రల్ ఏసీపీగా నియమించారు. ఈయన గతంలో ఇక్కడే ఇన్‌స్పెక్టర్‌గా, ట్రాఫిక్ ఏసీపీగా పనిచేశారు. ఆయన్ను మళ్లీ ఇప్పుడు విజయవాడకు తీసుకొస్తున్నారు. విజయవాడ సౌత్ ఏసీపీగా ఉన్న జి.రత్నరాజును డీఎస్ఆర్బీ డీఎస్పీగా బదిలీ చేశారు. రత్నరాజు లోగడ విజయవాడలో ఇన్‌స్పెక్టర్‌గా, రైల్వేలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించినప్పుడు పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆయన్ను డీఎస్ఆర్బీ డీఎస్పీగా నియమించడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. ఇక్కడున్న టీవీఎస్ నాగేశ్వరరావును ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేశారు. విజయవాడ పశ్చిమలో ఉన్న పడాల మురళీకృష్ణారెడ్డిని డీజీపీ కార్యాలయానికి పంపారు. గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా ఉన్న వీవీ నాయుడును విజయవాడ ట్రాఫిక్-1 ఏసీపీగా బదిలీ చేశారు. విజయవాడ ట్రాఫిక్-1 ఏసీపీగా ఉన్న బి.జనార్ధనరావును తెనాలి డీఎస్పీగా నియమించారు. విజయవాడ సీఎస్బీ ఏసీపీగా ఉన్న బి.పార్థసారథిని కుప్పం డీఎస్పీగా పంపారు. విజయవాడ దిశ ఏసీపీగా ఉన్న కె.ప్రకాశ్‌బాబును రాజంపేట డీఎస్పీగా బదిలీ చేశారు. సీఐడీ ఎస్సీ, ఎస్టీ సెల్‌లో ఉన్న వి.మల్లికార్జునరావును దిశ ఏసీపీగా నియమించారు.



పార్లమెంట్ వేదికగా..

సైబర్ దాడుల అదుపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

» బందరు ఎంపీ బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల అదుపుచేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించారు. 2021 నుంచి 2023 సంవత్సరాల్లో 300శాతం సైబర్‌నేరాలు పెరిగినట్టుగా సింగపూర్‌కు చెందిన సెక్యూరిటీ సంస్థ ఇచ్చిన నివేదికపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని ఆయన ప్రశ్నించారు. వివిధ రంగాల్లో సేవల కంపెనీలు, అవుట్‌సోర్సింగ్ (బీపీవోలు), ప్రభుత్వ సంస్థలపై సైబర్‌దాడులు జరిగాయనే విషయంలో వాస్తవాలను ఆయన ప్రశ్నించారు. సైబర్‌నేరాలను అదుపు చేసేందుకు ప్రభుత్వం యోచన చేస్తోందా అని ఆయన అడిగారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సహాయమంత్రి జితిన్ ప్రసాద్ సమాధానమిస్తూ కంప్యూటర్‌లు, మొబైల్ ఫోన్లు, నెట్‌వర్క్‌లు, వివిధ సంస్థల డేటాను పరిరక్షించడానికి సీఈఆర్‌టీ-ఇన్ సర్వీసు ద్వారా హెచ్చరికలను జారీచేస్తున్నట్టు తెలిపారు. మోసపూరిత కార్యకలాపాలపై దర్యాప్తును వేగవంతం చేయడానికి సీఈఆర్‌టీ-ఇన్ సర్వీస్ ప్రొవైడర్లు, రెగ్యులేటర్ లాఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు పనిచేస్తున్నట్టు తెలిపారు. డేటా, నెట్‌వర్క్ భద్రత, యాక్సెస్ మేనేజ్‌మెంట్, అప్లికేషన్ సెక్యూరిటీ, తదితర అంశాలపై 2023లో ప్రభుత్వ సంస్థలకు భద్రతా పద్ధతులపై సీఈఆర్‌టీ-ఇన్ మార్గదర్శకాలను జారీచేయడం జరిగిందన్నారు.

ప్రధానమంత్రి మోదీకి ధన్యవాదాలు

కేంద్ర ప్రభుత్వం ఏపీలోని వివిధ రైల్వేప్రాజెక్టుల కోసం రూ.9151కోట్లను కేటాయించినందుకు ప్రధానమంత్రి మోదీకి ఎంపీ కృతజ్ఞతలు తెలియజేశారు. మచిలీపట్నం-నర్సాపురం రైల్వేలైను నిర్మాణంతోపాటు, మచిలీపట్నం-రేపల్లెల మధ్య రైల్వేలైను నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ఆయన కోరారు. గతేడాది అక్టోబరు నెలలో నిలిచిపోయిన మచిలీపట్నం-తిరుపతి రైలును పునరుద్ధరించాలని ఆయన కోరారు.



జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సృజన

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

» జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 31 : యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌కు చెందిన ఎస్కే. సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేఏల్ గ్రూప్ సంస్థల సౌజన్యంతో అమెజాన్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి బుధవారం గొల్లపూడిలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, యువత అవకాశాలను అందిపుచ్చుకున్నపుడే జీవితంలో స్థిరపడగలుగుతారన్నారు. కేఏల్ గ్రూప్ అమెజాన్ సంస్థ ప్రతినిధి రమణ మాట్లాడుతూ, నెల్లూరు సమీపంలో తడ వద్ద ఉద్యోగాల కల్పనలో కలెక్టర్ కోరిక మేరకు గిరిజన యువతకు అవకాశాలు ఇచ్చేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. ఇంగ్లీష్ చదివి అర్థం చేసుకొనే పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. అర్హత పొందిన వారికి నామమాత్రపు రుసుముతో హాస్టల్ వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వారానికి ఐదు రోజులు పనిదినాలు ఉంటాయని, అదనపు పనిదినానికి రోజుకు రూ.1275 చెల్లించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనులను నిర్వహించవలసి వుంటుందని, ఇందుకు అవసరమైన శిక్షణ ఇస్తామని తెలిపారు. జాబ్‌మేళాకు 66 మంది గిరిజన యువత హాజరుకాగా 52 మందిని ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకురాలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె.సునీత తెలిపారు. జాబ్‌మేళాలో డీఆర్‌డీపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాకమిటీల ఎన్నికలు

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఆగస్టు 8న నిర్వహించాలని అడిషనల్ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ తెలిపారు. ఆగస్టు 1న ప్రధానోపాధ్యాయులు ఎస్ఎంసి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. 5న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితా ప్రకటించాలన్నారు. 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరపాలని, 3 గంటలక తొలి సమావేశం నిర్వహించి స్కూలు అభివృద్ధి పనులపై చర్చించాలన్నారు.



గంజాయితో పట్టుబడిన వ్యక్తితో సీఐ

గంజాయి స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, జూలై 31 : షేర్‌మహ్మద్‌పేట వద్ద అక్రమంగా గంజాయి కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి బుధవారం తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గ్రామంలో చెరువు సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఒడిసాలోని కలహండి జిల్లా కైరుపదారు గ్రామానికి చెందిన సంతోష్ కానసమ అనే వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామంలో ఉంటూ ఆటోనగర్‌లోని కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్టు తెలిపారు. ఇటీవ స్వగ్రామానికి వెళ్లి వచ్చే సమయంలో గంజాయి తీసుకువచ్చినట్టు తెలిసిందన్నారు. తనకు గంజాయి తీసుకునే అలవాటు ఉందని అంతేకాకుండా ఇతరులకు కూడా విక్రయిస్తున్నట్టు తెలిపారు.

ఉపాధి పథకం.. రైతులకు ఊతం

» ఎన్టీఆర్ జిల్లాలో 1760 ఎకరాల్లో పండ్లు, పూల తోటల పెంపకం

» పుల్లూరులో కలెక్టర్ సృజన పర్యటన

» మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



మైలవరంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

మైలవరంరూరల్, జూలై 31 : ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ఊతం ఇస్తుందని, నూరుశాతం సబ్సిడీ కింద ఉద్యాన పంటలను చేపట్టి ఆర్థిక పరిపుష్టి కల్పిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. మండలంలోని పుల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తమంగాపురం, చిలుకూరువారిగూడెం గ్రామాలలో మంగళవారం కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేశారు. ఈసందర్భంగా కొత్తమంగాపురంలోని మల్లెతోటలను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. చిలుకూరువారిగూడెంలోని అప్పిడి సుబ్బారెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు బోధన ప్రణాళిక తీరును పరిశీలించారు. అధికారులకు మధ్యాహ్న భోజనం, టీచింగ్‌పై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సృజన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 1760 ఎకరాలలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల, పూల తోటల సాగును చేపట్టేలా రైతులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. 40 ఎకరాలలో రైతులు మల్లె, గులాబి తోటల పెంపకాన్ని చేపట్టారని, మిగిలిన 1720 ఎకరాలలో మామిడి, జామ, నిమ్మ, సపోట, నారింజ, తదితర పండ్ల మొక్కల పెంపకాన్ని చేపట్టారన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పండ్లు, పూల తోటల పెంపకం ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పండ్లు, పూలసాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ఉపాధి హామీ ద్వారా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్‌తోపాటు ఉపాధి హామీ పథకం ప్రాజెక్టర్ డైరెక్టర్ జె.సునీత, డీపీవో ఎస్వీ శివప్రసాద్‌యాదవ్, ఏపీవో వెంకటేశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజర్ కె.ఉషారాణి, వంశీకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీహరి, ఎంఈవో బాలు, ఎండీవో శ్రీనివాస్, ఏపీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ విభాగాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, పనులను వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో బుధవారం ఉపాధిహామీ పనులు, గృహనిర్మాణం, టిడ్కో, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణాలకు సంబంధించిన లేఅవుట్లలో, టిడ్కో గృహాల వద్ద అంతర్గత రహదారులు, విద్యుత్ కనెక్షన్లు, తాగునీరు తదితర మౌలిక వసతులను వేగవంతం చేయాలన్నారు. ఉపాధిహామీ పథకంద్వారా ఈ ఏడాది 2.11లక్షల జాబ్‌కార్డులు ఇచ్చి 59.11 లక్షల పనిదినాలను కల్పించామన్నారు. ఉపాధిహామీ పనుల ద్వారా రూ. 154.13 కోట్లను కూలీలకు వేతనంగా చెల్లించడం జరిగిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, టిడ్కో పీడీ బి చిన్నోడు, విద్యుత్‌శాఖ ఎస్ఈ మురళీమోహన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతగల ఉద్యమ నేత ఉపేంద్రబాబు

» ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

ధర్నాచౌక్, జూలై 31 : జి.ఉపేంద్రబాబు నిబద్ధగల జర్నలిస్టు ఉద్యమనేత అని జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టు ఐక్యతకు ఆయన ఎనలేని కృషి చేశారని ఐజేయూ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల మృతి చెందిన ఆంధ్రజ్యోతి పూర్వ డిప్యూటీ ఎడిటర్, ఏపీయూడబ్ల్యూజే మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్రబాబు సంతాప సభ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. తొలుత ఆయన చిత్రటానికి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల ఉద్యమ నిర్మాణానికి, విస్తరణకు ఆయన చేసిన కృషిని వివరించారు. జర్నలిస్టుల ఉద్యమానికి ఆయన అందించిన సేవలకు చిరస్మరణీయంగా ఆయన పేరిట ఒక కార్యక్రమానికి రూపకల్పన చేస్తామన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, విజయవాడ ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి పి.వెంకట్రావ్ తదితరులు మాట్లాడుతూ, ఉపేంద్రబాబు మృతి తీరని లోటన్నారు.



ఉపేంద్ర చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

చందు జనార్థన్, ఎస్‌కే.బాబు, చావా రవి, ఉపేంద్ర కుమారుడు జి.అజయ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా తదితరులు పాల్గొని ఉపేంద్రబాబుకు ఘనంగా నివాళులర్పించారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ గీతాబాయి

లింగ నిర్ధారణ పరీక్ష నేరం

మచిలీపట్నం టౌన్, జూలై 31: స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో గీతాబాయి హెచ్చరించారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాల్లో ధరలపట్టిక, హెచ్చరిక బోర్డులు ఉంచాలని గీతాబాయి సూచించారు. జనాభాలో స్త్రీ, పురుష నిష్పత్తుల్లో వ్యత్యాసం లేకుండా వ్యవహరించాలని ఆమె సూచించారు. సమావేశంలో వైద్యులు మహేష్, ఎస్ అమృత, పి.చాందిని, ఐ.వినిల్, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, కరెడ్ల సుశీలతో పాటు కార్యాలయ సిబ్బంది శివసాంబిరెడ్డి, రాజేంద్రకుమార్, మస్తానమ్మ, శివసుధ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ

వన్‌టౌన్, జూలై 31 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి బుధవారం 22 బృందాలకు చెందిన 1250 మంది మహిళా భక్తులు ఆషాఢ సారె సమర్పించుకున్నారు. విజయవాడ నుంచి టీ రవీనా, చిట్టినగర్ కుండల మార్కెట్ గంగ దుర్గ మారెమ్మ విశ్వేశ్వరస్వామి దేవస్థానం నుంచి 500 మంది,వర్మ బృందం 100 మంది రాణి బృందం 70 మంది ఇలా పలు ప్రాంతాలనుంచి 22 బృందాలకు చెందిన 1250మంది అమ్మవారికి సారె సమర్పించి పూజలలో పాల్గొన్నారుఅర్చకులు ఆశీస్సులు అందచేశారు సారెతీసుకువచ్చిన బృందాలకు ఈవో రామరావు ఆధ్వర్యంలో అధికారులు స్వాగతం పలికి మార్గదర్శనం చేశారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

కాకినాడ జగన్నాధపురానికి చెందిన తేజో మూర్తుల సూర్యకుమార్ , కుటుంబ సభ్యులు బుధవారం ఆలయానికి విచ్చేసి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అన్నవితరణ కార్యక్రమానికి 1166 యూఎస్ డాలర్లు, మరో 2350 నగదును అధికారులకు అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి చర్యలు

ఉంగుటూరు, జూలై 31 : పౌరసరఫరాల శాఖద్వారా రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై ఉంగుటూరు ఎస్సీకాలనీ, రామాలయం వీధిలో ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీలత, పీడీఎస్ ఉప తహసీల్దార్ ప్రధాన్‌తో కలిసి బుధవారం సాయంత్రం ఆమె సర్వే నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న రేషన్ పంపిణీ విధానం, పెరుగుతున్న ధరల గురించి ప్రజల నుండి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈసందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ ప్రజాపంపిణీలో మరిన్ని నిత్యావసరాలు అందించడంపై ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. ప్రజలకు అందజేస్తున్న బియ్యంతోపాటు అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనపథకంలో వినియోగించే సరుకుల నాణ్యతను పరిశీలించి మరింత మెరుగైన నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామాల్లో సర్వే జరుపుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ, పీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



కాలనీలో మహిళల అభిప్రాయాలు తెలుసుకుంటున్న డీఎస్‌వో

దస్తావేజు నకలు ఇప్పించలేదని దాడి

» కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కలకలం

» ఒకరికి గాయాలు.. కేసు నమోదు



సబ్ రిజిస్ట్రార్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై తాతాచార్యులు, ఇన్‌సెట్‌లో రెహ్మాన్

కంకిపాడు, జూలై 31 : కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందరు చూస్తుండగానే వ్యక్తిపై దాడికి పాల్పడం స్థానికంగా కలకలం రేకెత్తించింది. తనకు నకలు ఇప్పించడం లేదంటూ కంకిపాడుకు చెందిన దేవరపల్లి శ్రీనుపై గంగూరుకు చెందిన అబ్దుల్ జావేర్ రెహ్మాన్ పీలర్‌తో దాడి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని విజయవాడలో ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు రెహ్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడుకు చెందిన దేవరపల్లి శ్రీను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద టీ, కాఫీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి అవసరమైన భోజనాలు, వారి పనులకు సహకరిస్తుంటాడు. ఆ క్రమంలో గంగూరుకు చెందిన రెహ్మాన్ తన తండ్రికి గూడవల్లిలో 62 సెంట్లు భూమి ఉందని, సదరు భూమికి సంబంధించిన నకలు ఇప్పించాలంటూ శ్రీనుకు రూ.50 వేలు ఇచ్చాడు. గత కొద్ది రోజులుగా నకలు ఇవ్వకుండా రెహ్మాన్ తిప్పించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన శ్రీనుపై రెహ్మాన్ పీలర్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో శ్రీనుకు గాయాలయ్యాయి. స్థానికులు రెహ్మాన్‌ను పోలీసులకు అప్పగించారు. బాధితుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్సై 2 తాతాచార్యులు తెలియజేశారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ త్రినాథ్‌ను వివరణ కోరగా ఘటనతో తమకు, కార్యాలయ సిబ్బందికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కార్యాలయంలోని సిబ్బందికి శ్రీను టీ, కాఫీలు, భోజనాలు అందిస్తూ ఉంటాడన్నారు.



మంగినపూడి బీచ్‌ను సందర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర

మంగినపూడి పర్యాటకంగా అభివృద్ధి

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 31 : ఐదేళ్ల వైసీపీ పాలనలో పర్యాటక రంగాన్ని పూర్తిగా విడిచిపెట్టారని, కూటమి ప్రభుత్వం పర్యాటకరంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఆ దిశగా అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగినపూడి బీచ్‌ని మంగళవారం అర్బన్ ఇన్‌ఫ్రాటెక్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతినిధి కిరణ్‌తో కలిసి సందర్శించారు. పర్యాటకులతో మాట్లాడారు. బీచ్ అభివృద్ధికి చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. మంగినపూడి అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అవసరమైన మేరకు హోటల్స్, రిసార్ట్స్ నిర్మిస్తామన్నారు. భద్రత కల్పిస్తామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి రామలక్ష్మణ్, టీడీపీ నేతలు కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పేదల పక్షపాతి : నెట్టెం



జగ్గయ్యపేట, జూలై 31 : గృహనిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లు లేని వారికి గ్రామాల్లో 2 సెంట్లు, పట్టణాల్లో 3 సెంట్లు, సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పేదలకు రూ.4లక్షలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించాయని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. బుధవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం కేవలం సెంటు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోమని మోసం చేసిందని, కేంద్రం గృహ నిర్మాణానికి ఇచ్చిన రూ.5వేలకోట్లను కూడా దారి మళ్లించారని ఆరోపించారు. పేదలకు నివేశన స్థలాల పేరుతో జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు తక్కువ ధరకు స్థలాలు కొని ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించి రూ. కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం యూనిట్‌కు ఇచ్చే రూ.1.80లక్షలు తప్ప జగన్ ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదని, అనేకమంది ఇళ్లను కట్టుకోకుండా మిగిలిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు పొంది ఇల్లు కట్టుకోలేని వారికి పీఎంఏవై 2.0 వర్తింపచేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఏటా 1.25లక్షల మందికి ఇళ్లు కట్టించాలని దృఢ సంకల్పంతో ఉన్నారని చెప్పారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలు షురూ.. : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్, జూలై 31 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ 2029 నాటికి శాశ్వత గృహవసతి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడం ముదావహమన్నారు. పింఛన్ రూ.4వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. రైతుల పాస్‌పుస్తకాలపై రాజముద్ర అభినందనీయమన్నారు. ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తానని ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి 5లక్షల ఇళ్లను కూడా సకాలంలో నిర్మించలేకపోయారన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందీ టీచర్ల పోస్టులు భర్తీ చేయండి

» మంత్రి నారా లోకేష్‌కు వినతి

అజిత్‌సింగ్‌నగర్, జూలై 31 : దామాషా ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హిందీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి షేక్ గైబువలి కోరారు. ఈ మేరకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు బుధవారం మెయిల్ ద్వారా వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హిందీ ఉపాధ్యాయుల కొరత ఉందని, దీంతో విద్యార్థులకు హిందీ భాషా బోధనలో సరైన న్యాయం జరగడం లేదన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు హిందీ భాషను ఎంపిక చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. మన దేశ అధికార భాష హిందీని నేర్చుకోవడానికి ప్రపంచ దేశాలు ఆశక్తి కనబరుస్తున్నాయని, విదేశాంగ లెక్కల ప్రకారం వందల సంఖ్యలో పలుదేశాల్లో యూనివర్సిటీల్లో హిందీ భాషా విభాగాలు వెలిసాయన్నారు. వచ్చే డీఎస్సీ, జేఎల్, డీఎల్ నోటిఫికేషన్లలో అవసరమైన హిందీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

వైసీపీ నేతలపై చర్యలు తీసుకోండి

» రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం డిమాండ్



మచిలీపట్నం టౌన్, జూలై 31 : గన్నవరం మండలం తెంపల్లి గ్రామ సర్పంచ్ కొలుసు శిరీషపై దౌర్జన్యానికి దిగిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ నాయకుడు గల్లా తిమోతి డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నంలో జరిగిన సమావేశంలో తిమోతి మాట్లాడారు. సచివాలయ అధికారులు ఎందుకు ఆలస్యంగా వచ్చారని అడిగిన సర్పంచ్ శిరీషను తెంపల్లి వైసీపీ కన్వీనర్ చిదంబరకుమార్ ఇష్టారాజ్యంగా దుర్భాషలాడుతూ దాడికి యత్నించారన్నారు. దీనిపై గన్నవరం ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని గల్లా తిమోతి చెప్పారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘ నాయకులు చిలకలపూడి పాపారావు, వరి శ్రీదేవి, పంచకర్ల సురేష్, బొమ్మసాని నరేష్, చేబ్రోలు మౌనిక, ఆరేపల్లి జేజమ్మలతో పాటు శిరీష పాల్గొన్నారు.

రైతు బజార్లలో దేశవాళీ కందిపప్పు విక్రయాలు

ధర్నాచౌక్, జూలై 31 : ఏపీ సివిల్ సప్లయిస్ కార్యాలయంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం వర్తక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తకులు, రైస్‌మిల్లర్లతో మంత్రి చర్చించి రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు దేశావళీ రకం రూ. 150, స్టీమ్ బియ్యం ఒక రకం రూ. 48, మరో రకం రూ. 47లకు అమ్మకం చేసేందుకు ఒప్పించడం జరిగిందని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు తెలిపారు. గురువారం నుంచి వీటిని విక్రయించేలా ఏర్పాట్లు చేయాలని జేసీలను మంత్రి ఆదేశించారని భాస్కరరావు పేర్కొన్నారు.

నాసా పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

పెనుగంచిప్రోలు, జూలై 31 : 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయిలో నాసా వారు నిర్వహించిన పరీక్షల్లో పెనుగంచిప్రోలు శ్రీ చైతన్య విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. మొత్తం ఈ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలకు పలు రకాల ప్రాజెక్టులను నిర్వహించారు. వీటిలో పది మంది విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులకు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పది మంది విద్యార్థులను సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ జి.పూర్ణచంద్రరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎంజి మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్ కుమార్, కో-ఆర్డినేటర్ సురేష్, డీన్ కౌసల్యదేవి, నాసా ఇంచార్జి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వీరంగం

» యూపీ యువకుడికి దేహశుద్ధి

విజయవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉన్న యూపీ యువకుడు నైజాం గేటు వద్ద బుధవారం రాత్రి హల్‌చల్ చేశాడు. మత్తులో రైల్వే ట్రాక్ దాటుతున్న యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఉత్తరాది నుంచి వస్తున్న రైలు నుంచి ఈ యువకుడు నైజాం గేటు వద్ద దిగినట్టు తెలుస్తోంది. అప్పటికే అతడు మత్తులో ఉన్నాడు. నైజాం గేటు వద్ద అటుఇటూ తిరుగుతూ అలజడి చేశాడు. చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో చొరబడే ప్రయత్నం చేయడంతో స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతడ్ని స్టేషన్‌కు తరలించారు. అతడు మద్యం మత్తులో ఉన్నాడా, గంజాయి మత్తులో ఉన్నాడా అన్న దానిపై పరీక్షలు నిర్వహిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50



నడిరోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

ఉయ్యూరు, జూలై 31 : కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపో బస్సులు ఎక్కడ పడితే అక్కడ మొరాయిస్తున్నాయి. ఉయ్యూరు - కాళేశ్వరరావు మార్కెట్‌కు తిరిగే 222 నంబరు మెట్రో బస్సు బుధవారం మార్కెట్ సెంటర్‌లో నడిరోడ్డుపై నిలిచి పోడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కాలంచెల్లిన బస్సులు నడుపుతూ డీజిల్ పొదుపు రావాలని డ్రైవర్లను, ఎక్కువ ఆదాయం తేవాలని కండక్టర్లను వేధిస్తున్నారుకానీ బస్సులు గురించి డిపో అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదని సిబ్బంది వాపోతున్నారు.











మానికొండలో గ్రామదేవతలకు ఆషాఢ సారె

ఉంగుటూరు, జూలై 31 : మానికొండలో గ్రామదేవతలు గంగానమ్మ, అంకమ్మ, బాలాంబ అమ్మవార్లకు బుధవారం ఆషాఢ సారె భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ప్రతి ఇంటినుంచి పసుపు, కుంకుమ, మేళతాళాలతో ఆలయానికి చేరుకున్నారు. అక్కడ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో సారెను సమర్పించారు. బాలాంబఅమ్మవారి దేవస్థానం నుంచి గంగానమ్మ, అంకమ్మ ఆలయాలకు వెళ్లి సారెను సమర్పించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనను అర్చకస్వాములు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి, వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈసందర్భంగా యార్లగడ్డ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చింతా శ్రీనివాసరావు, ఆరికట్ల రవికుమార్, వట్టికూటి కిషోర్‌కుమార్, గోగినేని బాలకృష్ణ, యానం పార్వతీశ్వరరావు, నర్ని వెంకటేశ్వరరావు, షేక్ అజీజ్ రహీం, యడ్లపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.




మానికొండలో పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

ఘనంగా రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం సామూహిక రమా సమేత సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు అరుణ దంపతులు వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వ్రత కార్యక్రమాన్ని జరిపించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ సిబ్బంది, అర్చకులు పర్యవేక్షించారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి రూ. 20 లక్షలు

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 31 : అధికారంలోకి వచ్చిన నెలన్నర రోజుల్లోనే ఈడుపుగల్లులో అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లులో రూ. 20 లక్షలతో చేపట్టిన అంతర్గత రహదారుల అభివృద్ధికి సర్పంచ్ పందిపాటి ఇందిరతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, మాజీ సర్పంచ్ షేక్ మాబు సుభాని, ఉపసర్పంచ్ కిలారు శ్రీను, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, షేక్ షకార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు అంచనాలివ్వండి : బోడె




అధికారులతో ఎమ్మెల్యే బోడె సమీక్ష

పెనమలూరు : నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, శ్మశానవాటికల అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పోరంకిలోని కార్యాలయంలో ఎంపీడీవోలు, ఇతర అధికారుల సమావేశంలో ఆయన అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. నియోజక అభివృద్ధికి కేంద్రం కేటాయించిన రూ.23 కోట్ల ఎన్‌ఆర్జీఎస్ నిధులతో జరగాల్సిన అభివృద్ధిపై చర్చించారు.




జీవ శిలీంధ్రనాశినితో ప్రయోజనాలు

చినఓగిరాల(ఉయ్యూరు), జూలై 31 : కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో చినఓగిరాలలో బుధవారం రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం నిర్వహించి వరి, కూరగాయల సాగులో జీవ శిలీంధ్రనాశిని ఉపయోగించడం వల్ల ప్రయోజనాలు రైతులకు అవగాహన కల్పించారు. ట్రైకోడెర్మా 90కేజీల పశువుల ఎరువుతో పాటు 10 కేజీల వేపపిండి కలిపి చివరి దుక్కులో చల్లుకుంటే మట్టి నుంచి సోకే తెగుళ్ల వ్యాప్తి తగ్గించవచ్చని సమగ్ర సస్యరక్షణ విజయవాడ కేంద్రం అధికారులు టి.ప్రేమరంజిత, సురేశ్ వివరించారు. మండల ఉద్యానశాఖ అధికారి నాగదేవిశ్రీ, వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.




నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు : ముదునూరు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సాయిపురం ఫీడర్‌కు మరమ్మతులు చేపడుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు సాయిపురం గ్రామంలో గృహ, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డి.కృష్ణనాయక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.













బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

ఉచిత వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, జూలై 31: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కౌతవరం గ్రామంలోని యానాది కాలనీలో గిరిజన సంక్షేమ జిల్లా శాఖ ఉచిత వైద్యశిబిరం నిర్వహించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో నిర్వహించిన ఈ శిబిరాన్ని జిల్లా న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య ప్రారంభించారు. గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి బి.ప్రకాశరావు, గుడ్లవల్లేరు తహసీల్దార్ బి.కనకదుర్గ, ఏఎస్సై సాంబశివరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షకీలాబేగం, కౌతవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బొప్పన శ్రావ్య డాక్టర్ అర్చన పాల్గొన్నారు.

మత్స్యకార సహకార సంఘం ఎన్నిక వాయిదా

గుడ్లవల్లేరు, జూలై 31: మత్స్యకార సహకార సంఘం నెంబరు ఎస్ఎస్-1 ఎన్నికను వాయిదా వేసినట్టు ఎన్నికల అధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఎన్నిక నిర్వహించాల్సి ఉన్నా నామినేషన్లు ఎవరూ వేయక పోవడంతో వాయిదా వేశామని తెలిపారు.

అవనిగడ్డలో డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తా

- అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించండి
- అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశం

అవనిగడ్డ, జూలై 31: గ్రామంలో ప్రధాన డ్రెయినేజీ సమస్య పరిష్కారంపై దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం సీతాయమ్మ హోటల్ వద్ద డ్రెయినేజీని ఆయన పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.సత్యనారాయణతో కలసి గ్రామ డ్రెయినేజీ మ్యాప్‌ను పరిశీలించారు. డ్రెయినేజీ అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఉపాధి పథకం నిధులు నియోజకవర్గానికి రూ.20 కోట్లు కేటాయించిన నేపథ్యంలో డ్రెయినేజీల అభివృద్ధికి 20 శాతం నిధులు కేటాయించినట్లు డీఈఈ వివరించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు, ఏఈ బి.జగత్, పంచాయతీ ఈవో టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డ్రెయినేజీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

వేకనూరు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

అవనిగడ్డ రూరల్: వేకనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆస్పత్రి అవసరాలు తెలుసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉందని సిబ్బంది తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. చిన్నారులకు రెగ్యులర్ పోలియో చుక్కలు వేశారు. తర్వాత రక్షిత మంచినీటి పథకం, ఓవర్ హెడ్ ట్యాంక్, ఫిల్టర్ బెడ్స్‌ను ఆయన పరిశీలించారు. మైక్రో ఫిల్టర్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.సత్యనారాయణ, ఏఈ బి.జగత్, ఉప సర్పంచ్ తుంగల మురళీకృష్ణ, తుంగల రాజేష్ పాల్గొన్నారు.

మండలిని కలిసిన బాపు శిష్యుడు సురేష్

అవనిగడ్డ: చిత్రకారుడు బాపు శిష్యుడు, నరసాపురానికి చెందిన చిత్రకారుడు కడలి సురేష్, విజయవాడ మన గ్రామం అధినేత మొవ్వ రామకృష్ణ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 4న మండలి వెంకట కృష్ణారావు జయంతిని పురస్కరించుకుని తాను గీసిన మండలి వెంకట కృష్ణారావు-ప్రభావతి దంపతుల చిత్రాన్ని బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులకు బహూకరించారు.

బుద్ధప్రసాద్‌కు డాక్టర్ శ్రీహరిరావు కుటుంబసభ్యుల ధన్యవాదాలు

అవనిగడ్డ: వైసీపీ ప్రభుత్వ హయాంలో హత్యకు గురైన దివి ప్రాంతానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆయన కుటుంబసభ్యులు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీహరిరావు కుమారుడు డాక్టర్ కోట ప్రవీణ్, సోదరుడు కోట శ్రీధరరావు, బంధువు బచ్చు వెంకటనాథ్, నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు మండలాలకు చెందిన డాక్టర్ శ్రీహరిరావు అభిమానులు బుద్ధప్రసాద్‌ను కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో తన తండ్రి హత్య కేసు విచారణ ముందుకు సాగలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బుద్ధప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని కేసు వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సీబీసీఐడికి కేసును అప్పగించారని, ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని ప్రవీణ్ తెలిపారు. కోట రాంబాబు, చెన్నగిరి సత్యనారాయణ, మర్రే గంగయ్య, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కరుణకుమార్, చందన నరసింహారావు, బచ్చు శ్రీహరి, లంకే యుగంధర్, కాగిత రామారావు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపర్చండి

అవనిగడ్డ, జూలై 31: అవనిగడ్డ బీసీ బాలుర వసతిగృహంలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, న్యాయవాది రాయపూడి వేణుగోపాలరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన బీసీ బాలుర వసతిగృహాన్ని పరిశీలించారు. వసతిగృహం వెనుక వైపున మురుగు నీరు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారిందని, దీని కారణంగా విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వసతిగృహంలోని స్నానగదులు, వాష్ రూముల తలుపులు దెబ్బతిన్నాయని, వీటిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి అమలు తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తాను పరిశీలన చేస్తున్నానని, ఇప్పటికే నియోజకవర్గంలోని పలు వసతిగృహాలు పరిశీలించి నివేదిక తయారు చేశానని, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ద్వారా ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



హాస్టల్‌లో బాత్‌రూమ్‌ల దుస్థితిని చూపుతున్న రాయపూడి వేణుగోపాలరావు

పట్టాభి స్మారక భవనంపై పార్లమెంటులో ప్రస్తావించడం అభినందనీయం

మచిలీపట్నం టౌన్, జూలై 31: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు దివంగత పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని మచిలీపట్నంలో ఏర్పాటు చేయాలని పార్లమెంటులో ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రస్తావించడం అభినందనీయమని హిందూ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ ఏఆర్కే మూర్తి అన్నారు. పరాసుపేటలో బుధవారం నిర్వహించిన బ్రాహ్మణ సేవా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టాభి స్మారక భవన నిర్మాణానికి ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్రలు ఎంతో పట్టుదలతో ఉన్నారన్నారు. ఇప్పటికైనా కౌన్సిల్ సమావేశంలో అజెండాగా పెట్టి భవన నిర్మాణానికి అనుమతులిస్తూ తీర్మానం చేయాలన్నారు. వేమూరి రామకృష్ణారావు, పి.వి.ఫణికు మార్, జె.సేతురామయ్య, కానుకొలను ఫణికిరణ్, వడ్లమన్నాటి మారుతీ దివాకర్, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

అమ్మవార్లకు ఆషాఢ సారె

కూచిపూడి, జూలై 31: మొవ్వ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మొవ్వలోని పలు దేవాలయాల్లో అమ్మవార్లకు భక్తులు ఆషాఢసారె అందజేసి ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంతోపాటు భీమేశ్వరస్వామి, రజకుల రామాలయం, గౌడ రామాలయం, షిరిడి సాయిబాబా మందిరం, రేణుకమ్మ మందిరం, గంగానమ్మ ఆలయాల్లో చీరలు, పసుపుకుంకుమ, పూలు, పండ్లు సమర్పించారు. విశేష పూజా కార్యక్రమాల్లో మహిళలు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



మొవ్వలో అమ్మవారికి సారె సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలి

- సచివాలయ సిబ్బందికి ఎండీవో రెడ్డయ్య ఆదేశం

పెడన రూరల్: మండలంలో ఉన్న 5,732 సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 5 గంటల నుంచే మొదలపెట్టాలని ఎండీవో వి.రెడ్డయ్య ఆదేశించారు. పింఛన్లు పంపిణీ చేయనున్న సచివాలయ ఉద్యోగులకు ఎండీవో కార్యాలయంలో విధి విధానాలను వివరించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ పలుసూచనలు చేశారు. ఉద్యోగులు బుధవారం రాత్రి గ్రామాల్లో ఉండి ఉదయాన్నే లబ్ధిదారులకు పింఛన్లు అందించాలని సూచించారు. అన్ని పంచాయతీ కార్యాలయాల సమాచారం కంట్రోల్ రూంద్వారా ఎప్పటికప్పుడు ఎండీవో కార్యాలయానికి సమాచారం తెలుస్తుందన్నారు. ఈవోఆర్డీ జయరామ, కార్యదర్శులు అనూరాధ, మీరా, ఉమాదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: ఎండీవో భారతి

పామర్రు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎండీవో ఎం.భారతి బుధవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఉదయం నుంచి ఇంటింటా పింఛన్లను గ్రామ సచివాలయ ఉద్యోగ సిబ్బందితో నూరుశాతం అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

మెడికల్ కళాశాలకు తాగునీటి పైపులైన్లు

మచిలీపట్నం టౌన్, జూలై 31: మెడికల్ కళాశాలకు తాగునీరందించేందుకు హెడ్‌వాటర్‌వర్క్స్ నుంచి బుధవారం పైపులైన్ల నిర్మాణాలు చేపట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు కమిషనర్ బాపిరాజు ఈ కార్యక్రమాలను చేపట్టారు.

శాకంబరీదేవిగా అమ్మవార్లు





బొబ్బర్లంకలో అంకమ్మ, పామర్రులో పార్వతీదేవి

మోపిదేవి, జూలై 31: బొబ్బర్లంకలో అంకమ్మ అమ్మవారు శాకంబరీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. పలు ప్రాంతాలకు చెందిన రైతులు, గ్రామస్థులు అందించిన వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు బాలా జగన్నాథ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పామర్రులో పార్వతీదేవి

పామర్రు: గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి(శివాలయం) దేవస్థానంలో బుధవారం అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు లంక భీష్మ ఆధ్వర్యంలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. ఈవో వెంకటరెడ్డి ఆలయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎన్నికల్లో శానిటేషన్ పనులకు మునిసిపల్ నిధులు ఎలా కేటాయిస్తారు?

- పెడన మునిసిపల్ సమావేశంలో జనసేన కౌన్సిలర్ మట్టా శివపావని నిలదీత



పెడన మునిసిపల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కటకం నాగకుమారి

పెడన, జూలై 31: ఎన్నికల్లో శానిటేషన్ పనులకు మునిసిపల్ నిధులు ఎలా కేటాయిస్తారని జనసేన పార్టీ 12వ వార్డు కౌన్సిలర్ మట్టా శివపావని నిలదీశారు. పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని చైర్ పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అజెండాలోని 23 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా శానిటేషన్ పనులకు మునిసిపల్ నిధులు కేటాయింపును అజెండాలో 11, 12 అంశాలుగా చేర్చారు. ఈ కేటాయింపులపై శివపావని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటాయింపులతో మునిసిపాలిటీకి సంబంధం లేదని, ఆ బాధ్యత రిటర్నింగ్ అధికారిదేనని అన్నారు. ఆర్వో నుంచి నిధులు వచ్చాకే శానిటేషన్ పనులకు కేటాయింపులు జరపాలని పట్టుబట్టారు. అత్యవసరమైనందున కలెక్టర్ ఆదేశాలతో శానిటేషన్ పనులకు మునిసిపల్ నిధులు కేటాయించామని కమిషనర్ వెంకట్రామయ్య తెలిపారు. కేటాయించిన నిధులు తిరిగి వస్తాయని ఆయన స్పష్టంచేశారు. ఆర్వో నిధులిచ్చాకే శానిటేషన్ పనులకు కేటాయింపులు జరపాలని, ఈ అంశంపై తాను డిసెంట్ ఇస్తున్నానని శివపావని ప్రకటించారు. ఈ అంశం పై 8వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడబోగా మీరెవరు మాట్లాడటానికి అని శివపావని ప్రశ్నించారు. దీంతో వారిరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. మునిసిపాలిటీ ఖర్చు చేసిన నిధులు తిరిగి ఇచ్చేస్తామని ఆర్వో మీకు లెటర్ ఇచ్చారా అని కమిషనర్‌ను శివపావని ప్రశ్నించారు. మీరడిగితే చెప్పాల్సిన అవసరం లేదని చైర్‌పర్సన్ అడిగితేనే తాను సమాధానం చెబుతానని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడటం లేదు కనుకే మిమ్మల్ని అడుగుతు న్నానని శివపావని ఘాటుగా స్పందించారు. మునిసిపల్ చెరువుల్లో తూటు కాడ ఉన్నందున వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని ఆర్‌ఐ పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. డ్రెయిన్లలో సిల్టు తొలగింపుకు రూ. 21.48 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు కటకం ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

చిట్టి పిల్లారయ్య సేవలో కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 31: మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం చిట్టి పిళ్లారయ్యస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయంలోని అర్చకులు మంత్రి రవీంద్రకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వినాయకుడికి జరిగిన ప్రత్యేక అర్చనలను కొల్లు రవీంద్ర తిలకించారు.



పూజల్లో పాల్గొన్న కొల్లు రవీంద్ర

బెరాకా వ్యవస్థాపకుడు సత్యనారాయణకు నివాళి

మచిలీపట్నం టౌన్, జూలై 31: బెరాకా చర్చి వ్యవస్థాపకుడు సత్యనారాయణ భౌతిక కాయాన్ని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జనసేన నాయకులు గడ్డం రాజు, కర్రి మహేష్ సందర్శించి నివాళులర్పించారు. సత్యనారాయణ కుమారుడు బ్రదర్ కిరణ్‌పాల్‌ను పరామర్శించారు.



సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కొనకళ్ల నారాయణరావు, బండి రామకృష్ణ

గౌరవప్రదమైనది ఉపాధ్యాయవృత్తి

పెదపారుపూడి, జూలై 31: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ఎలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టు అధ్యాపకురాలిగా పని చేస్తున్న సూరపనేని లక్ష్మీకుమారి బుధవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేశారు. అనంతరం లక్ష్మీకుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరపనేని వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

మచిలీపట్నం టౌన్, జూలై 31: బచ్చుపేటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అగ్నిమథనం, నవగ్రహారాధన, నారాయణ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి చక్రధరరావు, ఆలయ స్థానాచార్యుడు ముత్తేవి శశికాంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాల్వ పూడికతీత పనులు ప్రారంభం

కోడూరు, జూలై 31: కోడూరు ఈస్ట్ చానల్ 14వ నెంబర్ కాలువ పూడికతీత పనులను ఇరిగేషన్ అధికారులు బుధవారం ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈ రవికిరణ్, ఏఈ విజయ్‌కుమార్ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో పూడికతీత పనులు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

మొక్కలు నాటి, సంరక్షించడం

సామాజిక బాధ్యత

చల్లపల్లి, జూలై 31: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించడాన్ని సామాజిక బాధ్యతగా అలవరచుకోవాలని స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి సూచించారు. బుధవారం స్వచ్ఛ చల్లపల్లి 3,190వ రోజు సందర్భంగా హైవేకు ఇరువైపులా కార్యకర్తలు మొక్కలు నాటారు. ట్రస్ట్ ఉద్యోగులు వాటికి రక్షణగా కంపకట్టారు. వర్షాకాలంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని వైద్య దంపతులు పిలుపునిచ్చారు.

రక్తదానం చేసి

ప్రాణదాతలు కావాలి

చల్లపల్లి, జూలై 31: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్(బ్లడ్‌క్యాంప్స్) టి.సాంబశివరావు సూచించారు. వివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం కళాశాలలో నిర్వహించారు. రక్తదానం ఆవశ్యకతను వివరించారు. ఏడాదిలో ఎన్నిసార్లు రక్తదానం చేయొచ్చు. ఏయే వయసుల వారు చేయొచ్చు అనే అంశాలపై యువతకు సాంబశివరావు అవగాహన కల్పించారు. స్వచ్ఛంద రక్తదాన ఉద్యమాన్ని యువత ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.రమేష్‌బాబు, చల్లపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ, ఇంగ్లీష్ అధ్యాపకుడు కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు

మచిలీపట్నం టౌన్, జూలై 31: మచిలీపట్నంలోని ప్రధాన వైష్ణవ దేవాలయాల్లో బుధవారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో భగవద్గీత పారాయణలు చేశారు. రాబర్ట్సన్‌పేట రంగనాయక స్వామి దేవాలయం, బచ్చుపేట వేంకటేశ్వరస్వామి, గొడుగుపేట వేంకటేశ్వరస్వామి, చల్లరస్తా సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామివార్లకు పూజలుచేశారు.

కూచిపూడి: ఆషాఢ బహుళ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో విశేషపూజలు జరిపారు. చినముత్తేవిలో అన్నపూర్ణ సమేత సోమేశ్వరస్వామి, కూచిపూడిలో బాలాత్రిపుర సుందరీదేవి, మొవ్వ భీమేశ్వరస్వామి, పెడసనగల్లు వేంకటేశ్వరస్వామి, పెదపూడి సాయిబాబా ఆలయాలతోపాటు నిడుమోలు, అయ్యంకి, కోసూరు గ్రామాల్లోని ఆలయాల్లో అలంకరణ, అర్చకులు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ నేత ఆదినారాయణకు పరామర్శ

కోడూరు, జూలై 31: తెలుగుదేశం పార్టీ కృష్ణా జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ తండ్రి సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. బుధవారం కోడూరు మండలం పిట్టల్లంకలోని ఆదినారాయణ స్వగృహంలో బీసీ నేత, టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు, పార్టీ అవనిగడ్డ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, సీపీఎం జిల్లా నాయకులు ఆవుల బసవయ్య, బీసీ, దళిత సంఘాల నాయకులు లుక్కా శ్రీనివాసరావు, కర్రి కృష్ణమూర్తి, బలుసుపల్లి రత్నకుమార్, చీరాల తుఫాన్, కుంపటి గణేష్‌లు పరామర్శించారు. అనంతరం సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.